క్లుప్తంగా

ఘనంగా కలశాల ఊరేగింపు



స్వామివారి కలశాల ఊరేగింపులో భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవీ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు మంగళవారం కలశాలను స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వాసవీ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణతో యాగశాల నిర్వహించి చతుర్వేది పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, సంఘ సభ్యులు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి చికిత్స పొందుతున్న గూడూరు గురుప్రసాద్‌తోపాటు కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు సాగర్‌బాబు, కృష్ణయ్యలను పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి, బలిజ సంఘ నాయకులు, సభ్యులు, తదితరులు ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు

కమలాపురం : మండల పరిధిలోని చిన్నచెప్పలికి చెందిన చెప్పలి మల్లమ్మ (77) అనాథ మృతదేహానికి మంగళవారం అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మల్లమ్మ సోమవారం రాత్రి మృతి చెందిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ సభ్యుల సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు హనుమంతు, సుబ్రమణ్యం, బాలస్వామి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 8వ తేదీన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

అదనపు పరిహారం కోసం దరఖాస్తుల స్వీకరణ

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాలకు అదనపు పరిహారం కోసం దరఖాస్తులు రెవెన్యూ సిబ్బందితో తీసుకుంటున్నట్లు మండల తాహసీల్దార్ శోభనబాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఐదు ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదటి విడత గ్రామాల్లోని నిర్వాసితులు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను అందజేయాలని చెప్పడంతో నిర్వాసితులువచ్చి రెవెన్యూ సిబ్బందికి అందజేస్తున్నారు. మొదటి విడత గ్రామాలు దత్తాపురం 539, కె.బొమ్మేపల్లె 64, దొరువుపల్లి 25, గంగాపురం 19, సీతాపురం 03, పక్కీరపేట 5, ముచ్చుమర్రి 69, చౌటిపల్లె 257, రేపల్లె 126, బుక్కపట్నం 118, నేదరపేట-91, గండ్లూరు 129, కొర్రపాడు 27, ఓబన్నపేట 158 దరఖాస్తులను నిర్వాసితులు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు

పాడి పరిశ్రమతో ఆర్థిక స్వావలంబన

కడప అగ్రికల్చర్: నేటి పోటీ ప్రపంచంలో రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే ఆర్థిక స్వావలంబనను సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం కడప ఊటుకూరు కేవీకేలో గ్రామీణ యువతకు శాస్త్రీయ పాడిపరిశ్రమ యాజమాన్య పద్ధతులపై ఆర్య పథకంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాడి- పంట ప్రాముఖ్యత గురించి వివరించారు. సకాలంలో పశువులను గర్భం, చూడి దాల్చితే కలిగే లాభాల గురించి వివరించారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ మురళీకృష్ణ , పశు విజ్ఞా శాస్త్రవేత్త లావణ్య పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్య పథకంలో రైతులకు చాఫ్ కట్టర్లు, ఖనిజ లవణ మిశ్రమం , గడ్డి విత్తనాలు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



చౌటపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని చౌటపల్లె, చౌటపల్లె దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కా ర్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జ గన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాడన్నారు. అర్హు త ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను అదేశించారు. చౌటపల్లె దళితవాడలో సీసీరోడ్డులు వేయించాలని అడిగారు వెంటనే సంబంధిత అధికారులకు అదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిపై యువగళం పాదయాత్రలో నారా లోకేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహరెడ్డిలు అసత్య ఆరోపణలు చేయ డం తగదని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సా ర్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు అన్నారు. మండలంలోని చౌటపల్లె గ్రామంలో మంగళవారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మేలు జరిగితేనే ఆదరించండి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డి, చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, తదితర పథ కాల ద్వారా మేలు జరిగిందంటేనే వైఎస్సార్‌సీపీని ఆదరించండని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం పట్టణంలోని సంజామల మోటు, 19వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక పథకాలతో ప్రజలు లబ్ధిపొంది సంతోషంగా ఉన్నారన్నారు. గత టీడీపీ హయాంలో ఎన్నో హామీలు ఇచ్చారని ఆయితే ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. వారి ప్రభుత్వాన్ని కళ్లారా చూసిన ప్రజలు జగనన్నకు పట్టం కట్టారన్నారు. జమ్మలమడుగు చరిత్రలో ఎమ్మెల్యేలు ఏడాది పొడవున ప్రజలకు అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు. కానీ జగనన్న ప్రభుత్వంలో నేను ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పోరెడ్డి రామలక్షుమ్మ, సింగరయ్య, పట్టణ అధ్యక్షు డు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ గౌరీనాథ్ రావు, రామకృష్ణ, గుర్విరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న మండల ఇన్‌చార్జి, తదితరులు

వేముల : మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి పనులపై అలసత్వం వహించొద్దని.. అధికారులు సమన్వయంతో పనిచేసి సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. మండలంలోని సచివాలయ భవనాలను, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో అధికారులు లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పూర్తైన ఇళ్లకు బిల్లులు పెట్టమని అడుగుతున్నా డీఈ లాగిన్‌లో ఉన్నాయని హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి చెప్పడంపై మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డీఈ మండల సమావేశానికి రావాలని పట్టుబట్టారు. ఇళ్ల బిల్లుల విషయంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉన్నా నిర్లక్ష్యంపై డీఈ వచ్చి సమాధానం చెప్పేవరకు మాట్లాడవద్దని సూచించడంతో మాట్లాడకుండా వెళ్లిపోయారు. పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మూడేళ్లపాటు ప్రభుత్వం ఉచితంగానే సేద్యాలు, ఎరువులకు ఉపాధి ద్వారా బిల్లులు చెల్లిస్తుందన్నారు. 5 ఎకరాలు ఉన్న రైతులు అన్ని రకాల పండ్ల తోటలు పెంచునేందుకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో రైతులకు సూచించాలన్నారు. మండల సమావేశానికి హాజరు కానీ అధికారులపై తీర్మాణం చేసి కలెక్టర్‌కు నివేదించాలని మండల సమావేశంలో సభ్యులు తీర్మానించారు. అలాగే మండలంలోని వి.కొత్తపల్లె సచివాలయ సిబ్బందిని ఉత్తమ టీంగా ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి ఎంపిక చేశారు. దీంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సచివాలయ సిబ్బందిని శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది పనితీరును పర్యవేక్షించి వారి కృషిని అభినందిస్తూ సన్మానించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లీలావతి, నరసింహారెడ్డి, ఐసీడీఎస్ అధికారిణి సునీత, ఉపాధి ఏపీడీ సుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ అబ్దుల్, ఏఓ చెన్నారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోడు లక్ష్యం సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : ఈనెలాఖరులోగా జగనన్న తోడు పథకానికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మెప్మా సిబ్బంది, ఆర్పీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెప్మా పీడీ సురేష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులందరితో కూడా రూ.35వేలు త్వరగా కట్టించి పూర్తి చేయించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 8వ తేదీన గురువారం మున్సిపల్ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తారని ఈ జాబ్‌మేళకు 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల లోపు ఉన్న మహిళలందరూ హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పట్టణ అధికారి గంగులయ్య, మెప్మా సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు విధిగా చేయించుకోవాలి : 5 ఏళ్లలోపు పిల్లలకు విధిగా ఆధార్ కార్డు చేయించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వార్డు సచివాలయ మహిళా పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిన్నపిల్లల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పిల్లలకు కచ్చితంగా ఆధార్ కార్డు ఉండాలన్నారు. సచివాలయ పరిధిలోని 5 ఏళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డు చేయించాలన్నారు.

లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి శ్రీనివాసులు

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పట్టు పరిశ్రమపై పట్టు సాధించాలని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పట్టుపరిశ్రమ కార్యాలయంలో పట్టుపరిశ్రమ మండలాల ఇన్‌చార్జిలకు ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో గత ఏడాదిలో 20,060 ఎకరాలలో పట్టు సాగులో ఉండేదని.. ప్రస్తుతం అదనంగా 160 ఎకరాలలో సాగు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మంచి దిగుబడి ఇచ్చే పట్టు పంటపై గ్రామీణ ప్రాంతాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. సిరికల్చర్‌లో ఐదులేక ఆరు పంటలను సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఒక పంటకు ఒక లక్ష ఆదాయం వస్తుందని.. ప్రస్తుత కాలంలో చాలా మంది రైతులు సెరికల్చర్ సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వనిపెంట, ఊటుకూరు ప్రాంతాల నుంచి ఒక మొక్క రూ.2లతో ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఒక ఎకరాకు యూనిట్ ధర రూ.25 వేలు ఉంటే .. అందులో రూ.18,750ల సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అయితే 22,500ల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. షెడ్డులు నిర్మించుకుంటే యూనిట్ ధర రూ.4 లక్షలు ఉంటే.. రూ.3 లక్షలు సబ్సిడీ వస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు అయితే రూ.3.60 లక్షల సబ్సిడీ వస్తుందన్నారు. పులివెందుల ప్రాంతంలో 160 ఎకరాలలో పట్టు సాగు చేయాలని లక్ష్యంతో మండలాల ఇన్‌చార్జిలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్రికల్చర్‌లో పంటలు సాగు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. సెరికల్చర్‌లో పంటలు పండించే రైతులకు ఎటువంటి దళారీ వ్యవస్థ ఉండదన్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా మదనపల్లె, ధర్మవరం, హిందూపురం, పలమనేరు, కదిరి ప్రాంతాల్లోని మార్కెట్లకు వెళ్లి విక్రయాలు జరుపుకోవచ్చునన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట్టు సాగు చేయడానికి చాలామంది రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండలాల ఇన్‌చార్జిలు జగన్నాథ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు భూ సర్వేపై గ్రామసభ

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లె గ్రామ పంచాయతీలోని స్థానిక ఎంపీపీ స్కూల్ అవరణలో జగనన్న భూహక్కు- భూ సర్వే ఇళ్ల స్థలాలపై మంగళవారం అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి మాట్లాడారు. సభలో ఎంపీడీఓ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామ కంఠంలోని ఇళ్లు, స్థలాల యాజమాన్య హక్కులు సంబంధించిన డ్రాఫ్ట్ రికార్డ్ ఆఫ్ రైట్స్‌ను గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులో ఉంచడం జరిగిందని, దానికి సంబంధించిన ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ ప్రజలు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేయాలని ఆయన తెలిపారు. మండల సర్వేయర్ మాట్లాడుతూ కొక్కరాయపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 22 ఎకరాలు గ్రామ కంఠం పరిధిలో ఉందని ఇందులో 629 ప్రాపర్టీలు గుర్తించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, సర్పంచ్ చింతల శోభ, ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన రైల్వేశాఖలో కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. వందే భారత్ రైలు ప్రారంభోత్సవం చేస్తున్న మోదీ ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప చేసింది శూన్యమని విమర్శించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఒక్క ఉద్యోగం కూడ భర్తీ చేయలేదని విమర్శించారు. డీవైఎఫ్ఐ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సభను జయప్రదం చేయండి

కడప సెవెన్‌రోడ్స్: మదనపల్లెలో ఈనెల 19న జరిగే బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప, నాయకులు కానుగదానం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆ పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సభకు బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్ ఆకాశ ఆనంద్, 17 రాష్ట్రాల ఇన్‌ఛార్జులు, రాజ్యసభ సభ్యులు రామ్‌జీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర కో ఆర్డినేటర్ బాలయ్య తదితరులు హాజరవుతారన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి



వీఓఏలకు సూచనలు ఇస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్

ఎర్రగుంట్ల : స్వయం సహాయక పొదుపు సంఘాల బలోపేతంకు కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏ రివ్యూ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సంఘాలకు వస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని సభ్యులకు అందించాలన్నారు. సంఘాల గ్రేడింగ్, జగనన్నతోడు, హౌసింగ్ బిల్లు, స్త్రీనిధి ఇతర అంశాలపై వారితో చర్చించారు. జిల్లా స్థాయిలో మండలాన్ని ఉన్నతస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఏసీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఓ జగదీశ్వరీ, నాగేంద్ర, సీసీలు సభ్యులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం భాగ్యమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పాల సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రాజెక్టు అధికారి ఆనంద్‌నాయక్ హాజరై మాట్లాడారు. మండలంలోని యు.రాజుపాలెం, తంగెడుపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, అనిమెల గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభించామని పాల సేకరణ శాతం చాలా తక్కువగా ఉందని వీఓఎలు పాడి రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఇదివరకు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందిన వారి నుంచి రీకవరి చేయించాలని ఏపీఎం భాగ్యమ్మ సూసించారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, సీసీలు, వీఓఎలు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధి నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి

తొండూరు : మండల పరిధిలోని సంతకొవ్వూరు పీహెచ్‌సీ పరిధిలోని అగడూరు గ్రామంలో మంగళవారం డయేరియా వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ముంతాజ్ హాజరై మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లల మరణాలు 50 శాతం నీళ్ల విరేచనాలు, న్యుమోనియావల్ల జరుగుతున్నాయన్నారు. తల్లులకు, గర్భిణులకు నీళ్ల విరేచనాల నుంచి కలిగే దుష్పరిణామాలు, వాటిని గుర్తించి వాటి నివారణా మార్గాల గురించి వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ సుభద్రమ్మ, అగడూరు సీహెచ్‌ఓ సుధ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : డయేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మండల నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండలంలో ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని నేలతిమ్మాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియా పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి డయేరియా సోకకుండా ఉండేందుకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్‌లను అందించాలన్నారు. అనంతరం డయేరియా నివారణ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ సంయుక్త, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, ఆశా కార్యకర్త చంద్రకళ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : పట్టణంలోని సుందరయ్య కాలనీ, వినాయకనగర్ కాలనీలలో బుధవారం ఉదయం 6 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, పా ల్గొంటారని మండల ఇన్‌చార్జి సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు చక్కటి సౌకర్యాలు కల్పించాలి

● వైవీయూ వీసీ ఆచార్య సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల తెరిచే నాటికి వసతిగృహాలు అన్ని సిద్ధం చేయాలని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వైవీయూలోని వసతిగృహాలను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలతో కలిసి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన వీసీ మాట్లాడుతూ అవసరమైన చోట మరమ్మతులను చేపట్టాలని, మరీ ముఖ్యంగా అన్ని గదుల్లో వెలుతురు ఉండేలా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 19 నాటికి విద్యార్థులు రానున్న నేపథ్యంలో ఏ చిన్న అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి సౌకర్యవంతంగా వసతిగృహాలను తీర్చిదిద్దాలని ఆదేశాలు ఇచ్చారు. పరిశోధక విద్యార్థులతో ఆయన మాట్లాడి వారి పరిశోధన, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డాక్టర్ రెడ్డయ్య, ఇంజినీరింగ్ అధికారులు రాజశేఖరరెడ్డి, సోమశేఖరరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష..

విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య సమీక్ష నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు గౌరవం

ప్రొద్దుటూరు : టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదని.. వైఎస్సార్‌సీపీతోనే వారికి ఎనలేని గౌరవం దక్కిందని బీసీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. వ్యక్తిగత సమస్యల కారణంగా హత్యకు గురైన నందం సుబ్బయ్య నారా లోకేష్‌కు దేశ నాయకుడిలా కనిపిస్తున్నాడా అని ప్రశ్నించారు. నందం సుబ్బయ్య కనీసం వార్డు మెంబర్ కూడా కాదన్న విషయాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక భావనారుషి ఆలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. బీసీలంటే నారా లోకేష్ చిన్న చూపు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బీసీలకు పెద్ద పీట వేసి చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్ పదవులును కేటాయించగా, టీడీపీ తమకు ఉన్న 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతిని కూడా సస్పెండ్ చేసిందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బీసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ బీసీ నేతల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్నారు.

లోకేష్.. ఎక్కడైనా ప్రజా సమస్యలు ప్రస్తావిస్తున్నావా?

వైఎస్సార్‌సీపీ నేతలు

కమలాపురం : నారా లోకేష్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని, ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజా సమస్యల గురించి ప్రస్తావనే లేదని, ఎమ్మెల్యేలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్‌సాదిక్ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంత ఎమ్మెల్యేను విమర్శించడమే పనిగా పెట్టుకున్న లోకేష్ ప్రజా సమస్యల ప్రస్తావనే తీసుకు రావడం లేదన్నారు. ఒక్కసారైన ఎమ్మెల్యేగా గెలిచి లోకేష్ మాట్లాడితే బాగుంటుందన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే లోకేష్‌కు తెలుసా..

వీరపునాయునిపల్లె : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు అభివృద్ధి అంటే ఏమిటో తెలుసా అని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూరు మండలంలో జరిగిన బహిరంగ సభలో అభివృద్ధి అంటే ఏమిటో తెలియని లోకేష్ అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏమి అభివృద్ధి చేశారో తెలపాలన్నారు. సమావేశంలో పాయసంపల్లె, అనిమెల, ఇందేకూరు ఎంపీటీసీలు రామాంజనేయరెడ్డి, రాఘవ యాదవ్, రమేష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు

వల్లూరు : నిబంధనల మేరకే చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి తప్ప ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని, టీడీపీ నేతలు నిజాలు తెలు సుకోకుండా వైఎస్ఆర్‌సీపీ నేతలు నిబంధనలు అతిక్రమించి లోతుగా మట్టి తవ్వకాలను జరుపుతున్నారని అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని వైఎస్ ఆర్‌సీపీ నేతలు విమర్శించారు. కడపలోని జిల్లా వైఎస్ ఆర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భూసిపాటి కిషోర్ కుమార్, పార్టీ నేతలు విశ్వనాథరెడ్డి, బాల మైసూరారెడ్డి, పుల్లయ్యలు మాట్లాడారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిని టీడీపీ నేత నారా లోకేష్ విమర్శించడం హాస్యాస్పదంగా వుందన్నారు. వల్లూరు మండలంలోని మూడు పంచాయతీల నుంచి టీడీపీలో చేరింది సుమారు 20 కుటుంబాలేనని, దాని వలన వైఎస్ఆర్ సీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు.

నారా లోకేష్ అసత్య ఆరోపణలు మానుకోవాలి

చెన్నూరు : నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా చెన్నూరులో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించడం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎల్లమ్మ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏదైతే పేపర్లలో రాసి ఇచ్చారో దానిని లోకేష్ చిన్నపిల్లాడిలా చదవడం తప్ప, అందులో నిజానిజాలు తెలుసుకునే ప్రయ త్నం చేయలేదన్నారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తానుగాని ఎక్కడ కూడా ఒక సెంటు భూమి అక్రమంగా తీసుకోలేదన్నారు. టీడీపీకి చెందిన డాక్టర్ కృష్ణకిషోర్‌రెడ్డి వద్ద కొనుగోలు చేశామన్నారు. ఏదై నా జరిగిఉంటే కృష్ణకిషోర్‌రెడ్డి మాట్లాడేవారన్నారు. ఎప్పుడైతే కలెక్టర్ ఆ భూమికి సంబంధించి రెగ్యులరైజేషన్ చేశారో అప్పుడు కొనుగోలు చేశామన్నారు. తెలుగుదేశంకు చెందిన రామకోటిరెడ్డి 50 ఎకరాల డాటర్ ల్యాండ్‌ను రెగ్యులర్ చేసుకున్నప్పుడు, ఈ టీడీపీ నాయకులకు ఆ భూములు కనపడలేదా అని ప్రశ్నించారు. ఇవేవీ తెలుసుకోకుండా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని భూ బకాసురుడు అనడం అతని మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ వారీస్, మోహన్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి సర్పంచ్ తుంగచంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేస్తే సహించం

చింతకొమ్మదిన్నె : యువగళం పాదయాత్రలో నారా లోకేష్, పుత్తా నరసింహారెడ్డిలు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని సీకేదిన్నె వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని జెడ్పీటీసీ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో దాడులు, రౌడీయిజం ఎక్కువగా ఉండేవని ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. నేడు కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నది ఎమెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాత్రమే అన్నారు. సమావేశంలో 16వ డివిజన్ ఇన్‌చర్జ్ నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ క్రిష్ణయ్య, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.